# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-03-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **రహదారి ప్రమాదాలపై రాష్ట్రవ్యాప్తంగా అధ్యయనం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు.**

**2.** **సౌర విద్యుత్ వినియోగంపై గ్రామాల వారీగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.**

**3.** **ఆంధ్రప్రదేశ్‌లోని విమానాశ్రయాలకు మరిన్ని సర్వీసులు అందుబాటులోకి తీసుకురానున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.**

**4.** **నూతన సాంకేతిక నైపుణ్యాలను యువత అందిపుచ్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు.**

**5.** **ప్రపంచ స్థూలకాయ అవగాహనా దినోత్సవం ఈ రోజు నిర్వహిస్తున్నారు.**

==========================

రహదారి ప్రమాదాలపై రాష్ట్రవ్యాప్తంగా అధ్యయనం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఈ మేరకు ప్రకాశం జిల్లా ఉన్నతాధికారులతో దృశ్య మాధ్యమం విధానంలో అమరావతి నుంచి ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం కల్పించడం ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గుతున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య జిల్లాలో గణనీయంగా తగ్గిందని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలని ఉన్నతాధికారులను చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

-------------------------

సౌర విద్యుత్ వినియోగంపై గ్రామాల వారీగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ లో జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యక్రమాల్లో వార్డు సభ్యులు, సర్పంచులు, కార్పొరేటర్లు, మేయర్లు తప్పనిసరిగా భాగస్వాములవ్వాలని సూచించారు. భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు సరైన పంటలపై మార్గదర్శనం చేయాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల్లో

మాదకద్రవ్యాలు, గంజాయి వినియోగంపై విద్యాసంస్థలు కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక కోసం కాంగ్రెస్ ముఖ్యనాయకులతో చర్చించేందుకు ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈ రోజు ఢిల్లీ వెళ్లనున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విమానాశ్రయాలకు మరిన్ని సర్వీసులు అందుబాటులోకి తీసుకురానున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న విజయవాడ విమానాశ్రయ టెర్మినల్, విజయనగరం జిల్లా భోగాపురం గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం పనుల పురోగతిపై ఢిల్లీలోని తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో కేంద్ర మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, ఈ రెండింటి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను విస్తరించాలని సూచించారు.

---------------------------

నూతన సాంకేతిక నైపుణ్యాలను యువత అందిపుచ్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలులో ఒక ప్రైవేట్ ఏఐ శిక్షణా సంస్థను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలుకు ఇటువంటి సంస్థలు రావటం వల్ల జిల్లాలోని యువతకు మేలు జరుగుతుందన్నారు. ఈ కేంద్రం ద్వారా కృత్రిమ మేధ పై మరింత అవగాహన పెరుగుతుందని మంత్రి వివరిస్తూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పోడూరు, పాలకొల్లు గ్రామీణ మండలాల్లో చేపట్టనున్న రహదారి పనులను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ, అంగన్వాడీల సంక్షేమానికి, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు

వాయిస్ ..25 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని కాకినాడ జిల్లా వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో ఇటీవల పేలుడు సంభవించి పలువురు మరణించిన ఘటనపై ప్రభుత్వం విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. పట్టణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, ఈగల్ ఐజీ రవికృష్ణ నేతృత్వంలో కమిటీని ప్రభుత్వం నియమిస్తూ ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రమాద ఘటనకు బాధ్యులను గుర్తించి, నెల రోజుల్లో నివేదిక అందజేయాలని కమిటీని ఆదేశించింది.

---

ప్రపంచ స్థూలకాయ అవగాహనా దినోత్సవం ఈ రోజు నిర్వహిస్తున్నారు. వయసుతో సంబంధం లేకుండా అధిక బరువుతో బాధపడే సమస్యనే ఊబకాయం అంటారు. సరైన ఆహార నియమాలు పాటించక పోవడం, వ్యాయామం చేయక పోవడం, నిద్ర లేమి, మానసిక సమస్యలు వంటి వన్నీ స్థూల కాయానికి ప్రధాన కారణాలు. స్థూలకాయ నివారణ మార్గాల గురించి అవగాహన కల్పించడమే ప్రపంచ స్థూలకాయ అవగాహనా దినోత్సవ నిర్వహణలోని ముఖ్య ఉద్దేశం. సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా ఊబకాయాన్ని తగ్గించుకోవచ్చని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఒకానొక సందర్భంలో ప్రస్తావిస్తూ....

..వాయిస్... 20 సెకన్లు

---

పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్తతలు కారణంగా బహ్రెయిన్ విమానాశ్రయంలో చిక్కుకుపోయిన 65 మంది తెలుగువారిని స్వదేశానికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడిని కోరారు. ఈ మేరకు ఆయన కేంద్రమంత్రికి లేఖ రాశారు. బహ్రెయిన్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 39 మంది, తెలంగాణకు చెందిన 26 మంది చిక్కుకుపోయారని బాధితుల్లో కార్మికులు, విద్యార్థులు, పర్యాటకులు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల కారణంగా విమానాల రాకపోకలు నిలిచిపోయి వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కేంద్ర ప్రభుత్వం వారిని క్షేమంగా వెనక్కి రప్పించే ప్రయత్నం చేయాలని అప్పలనాయుడు కోరారు.

---

తెలంగాణలో అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో అత్యధికంగా 18,139 మెగావాట్ల విద్యుత్ వినియోగం నిన్న నమోదైందని వెల్లడించారు. ఉష్ణోగ్రతలు అధికం కావడం, వ్యవసాయ రంగానికి విద్యుత్ వినియోగం పెరగడంతో రాష్ట్రంలో రోజురోజుకీ డిమాండ్ పెరుగుతోందని చెప్పారు. సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు రాష్ట్రంలో పారిశ్రామిక అవసరాలకు విద్యుత్ వినియోగం అధికమవుతోందని తెలిపారు. భవిష్యత్ విద్యుత్ అవసరాలకు తగినట్లుగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

---

తమిళనాడు, అంతర కర్ణాటక మీదుగా మరాఠ్వాడా వరకు ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 0.9 కిలో మీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ యానం దిగువ ట్రోపో ఆవరణంలో వాయవ్య గాలులు వీస్తున్నాయని పేర్కొంది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో పలు చోట్ల పొడి వాతావరణం, ఒకటి రెండు చోట్ల పొగమంచు ఏర్పడే అవకాశముందని తెలిపింది.

తెలంగాణాలోనూ పొడి వాతవరణం కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

---

రైతులకు వారి భూమిపై పూర్తి హక్కులు కల్పించడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని బాపట్ల శాసనసభ్యులు

వి. నరేంద్ర వర్మ పేర్కొన్నారు. బాపట్ల జిల్లా జిల్లెలమూడి గ్రామంలో రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసు పుస్తకాలను రైతులకు ఆయన నిన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మాట్లాడుతూ, భూముల రీ–సర్వే ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రభుత్వ అధికారిక ముద్రతో కూడిన పాసు పుస్తకాల ద్వారా రైతులకు బ్యాంక్ రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాలు పొందడం సులభతరమవుతుందని తెలిపారు.

--------------------------

మత్స్యకార మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధ్యాన్యతనిస్తోందని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీభరత్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లోని విశాఖ జిల్లా భీమునిపట్నం మంగమారిపేట సముద్రంలో మత్స్యకార మహిళలకు సముద్రపు నాచు సాగుకోసం శ్రీభరత్ 20 రాఫ్ట్ లను అందించారు.

======================